# ఆ రోజేమైందంటే!

-పద్మలతా జయరాం

**ఒక వ్యక్తి జీవితంలో ఒకేసారి రెండు విభిన్న వ్యక్తిత్వాల్ని, మనస్తత్వాల్ని చూడడం అరుదు కదూ! ఒకే రోజు పరస్పర విరుద్ధమైన రెండు సంఘటనలను చూడడం ఇంకా అరుదేమో! అలాంటి అరుదైన సంఘటనే నేను ఇప్పుడు మీకు చెప్పబోతున్నాను. వింటారు కదూ!**

ఆ రోజు ఆఫీసు నుంచీ వచ్చేసరికి చీకటి పడింది. సాధారణంగా సాధ్యమైనంత త్వరగా ఇంటికి చేరుకుంటాను.

ఊరి చివరి ఇంట్లో అద్దెకుంటున్నాం మేం. మేం అంటే నేనూ, అమ్మా అంతే. నా మీద ఆధారపడి ఉన్న అమ్మకు మందులకూ, మా ఇద్దరి పోషణకూ నా జీతం సిటీలో అద్దెకి ఉంటే సరిపోదు మరి.

ఈ ఇంటి ఓనరుగారు, ఆయన భార్య, వారి ఒక్కగానొక్క కొడుకూ ఉండే ఈ ఇంట్లో ఓ తోడు ఉంటే బాగుంటుందని భావించి అద్దె కోసంగా కాక తోడుకోసం మాత్రమే మాకు అద్దెకు ఇచ్చారు. అమ్మ మహాకలుపుకోలు మనిషి. ఆవిడ పక్కనుంటే మూగవాళ్లకి కూడా మాటలొచ్చేస్తాయి. అరమరికలు, అంతస్థుల వ్యత్యాసాలు అమ్మకి అసలు తెలియవు.

అందుకే ఈ ఇంట్లోకి వచ్చిన పదిహేను రోజులకే మా పోర్షన్‌కీ, వాళ్ల పోర్షన్‌కీ మధ్యనున్న తలుపులు తెరుచుకున్నాయి. ఈ రెండేళ్ల నుండే అవి మరి మూసుకోలేదు.

పండగొచ్చినా కలిసే. పరగడుపుతో ఉండాల్సి వచ్చినా కలిసే. అంతలా ఒకటైపోయాం. వాళ్ల అబ్బాయి నాలాగే కాస్త ముభావంగా ఉంటాడు. ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం. ఓ రోజు మానేసినా జీతం నష్టపోయేందుకు సిద్ధం అవ్వాల్సిందే. ఇక అసలు సంగతికి వద్దాం.

ఆ రోజు చీకట్లో ఇంటికి వచ్చాను అని చెప్పాను కదూ. ముంగిట్లో పారిజాతం, కాస్త పక్కగా సంపెంగ, గేటు మీదికి పాకిన విరజాజి గుబురు, ప్రహరీ కనబడకుండా పాకిన సీతారత్నం పూలు తీగ. కొబ్బరిచెట్లు, మామిడి చెట్లు సరేసరి. ఇంకా చిన్నా చితగా చెట్లు కలిసి మా ఇల్లు ఓ పొదరిల్లు.

అడుగు పెడుతూనే నాకు పారిజాతం చెట్టు మొదట్లో ఏదో తెల్లగా కనిపించింది. కొంచెం భయం వేసింది. అయినా దగ్గరగా వెళ్లి చూశాను. అదేదో పక్షిలాగా కనిపించడంతో, గేట్లోంచే అమ్మని గట్టిగా కేకేశాను.

"ఇంత లేటేమిటే అమ్మా! కాస్త తొందరగా రాకూడదూ!'' అంటూనే బైటికి వచ్చింది.

"అటు చూడమ్మా!'' పారిజతం కుదురులో కదులుతున్న పక్షిని చూపించాను అమ్మకి.

"పాపం ఏదో పావురంలా ఉందే! చీకట్లో వాటికి కళ్లు సరిగా కనిపించవు కదా! అందుకే ఇక్కడుండిపోయింది.'' అంది అమ్మ.

"ఏవిటి వదినా!'' అంటూ వచ్చింది ఇంటి అత్తయ్యగారు. అమ్మ చూపించిన పక్షిని చూసి, కొడుకు సాయిని పిలిచింది ఆవిడ.

జాగ్రత్తగా దాని పొదివి పట్టుకుని ఇంట్లోకి తీసుకొని వచ్చాడు సాయి. అది పావురం కాదు. కొంగ. ఓ రెక్క విరిగింది. నడవడానికి కూడా కష్టపడుతోంది.

చిన్న పళ్లెంలో నీరు పోసి తాగించడానికి ప్రయత్నిచాడు సాయి. కాసిని ధాన్యపు గింజలు కూడా పోశాడు. కానీ అది వాటిని ముట్టుకోలేదు సరిగదా దగ్గరకొచ్చిన సాయిని ముక్కుతో చేతుల్నిండా పొడిచింది.

దాని భయం దానిది మరి. కుహుహూ అంటూ అదోరకమైన అరుపు. గదిలోంచీ బయట పడదామని ప్రయత్నం. బయటపడితే ఎక్కడ ఏ పిల్లి దాన్ని భోంచేస్తుందో అని మా భయం. ఎలాగయితేనేం తెల్లారింది

. దాన్ని ఉంచిన గదంతా రెట్టలతో నిండిపోయింది.

"రూపా! కాస్త నాతో వస్తావా!'' ఆఫీసుకి తయారవుతుంటే అడిగాడు సాయి.

"ఎక్కడికి?'' ఈ మొద్దబ్బాయికి ఇంత ధైర్యమా అని విస్తుపోయాను.

"వెటర్నరీ డాక్టర్ దగ్గరకు'' చెప్పాడు సాయి.

"ఎందుకూ!''

"పాపం! ఆ కొంగ ఎగరలేకపోతోంది. రెక్క విరిగింది కదూ! ఎలా బతుకుతుంది. అందుకే!'' నెమ్మదిగా అన్నాడు.

"సారూ! నాకియ్యి సారూ. కొంగ మాంసం శానా రుసిగుంటది. చేపలు తినీ తినీ ఎంత నేళంగా ఉందో! ఇయ్యి సారూ!'' ఇంటి పక్కన గుడిసె వేసుకున్న కోటయ్య పొద్దుణ్నించీ సాయి వెంబడే తిరుగుతున్నాడు.

"అక్కర్లేదు. వెళ్లు.'' విసుక్కున్నాడు సాయి.

"గట్లయితే గింత పసుపుకట్టు గట్టి, శెర్లో వదిలెత్తా'' అంటూ కొంగ మెడ పట్టుకోబోయాడు కోటయ్య.

"నీకు కాదూ చెప్పేది. ఉప్పు పసుపు కట్టు కడ్తావో, ఫలహారం చేస్తావో నాకు తెలుసు గానీ, నువ్వెళ్లు'' కోటయ్యని తరిమేశాడు సాయి.

"రూపా! కొంచెం దీన్ని వెనక్కూచుని పట్టుకో. వెట్ దగ్గరికెళ్దాం'' మళ్లీ అడిగాడు.

"సరేగానీ! మరి మీ ఆఫీసు? నేను కూడా వెళ్లాలి కదా!'' సందేహంగా అన్నాను.

"నువ్వు కాస్త లేట్‌గా వెళ్లు. గవర్నమెంట్ జాబే కదా! నేను వీలుంటే వెళ్తాను. లేకపోతే లేదు'' స్కూటర్‌ని స్టార్ట్ చేయ్యబోతూ అన్నాడు సాయి.

"ఈ కొంగ ఏమైనా మన పెంపుడు పక్షా? అనవసరంగా ఎందుకంత జీతం వేస్టు చేసుకుంటావురా పిచ్చి నాగన్నా!'' విసుక్కుంది ఇంటి అత్తయ్యగారు.

వినిపించుకోలేదు సాయి.

వెనుక కొంగని పట్టుకుని, అది నన్ను పొడవకుండా నానా తంటాలు పడుతూ కూచున్నాను. ఇదే మొదటిసారి పరాయి మగాడి స్కూటర్ ఎక్కడం.

డాక్టర్. ఓ చిన్న సైజు ఆపరేషన్ చేసి దానికి కట్టు కట్టాడు. ఓ ఇంజక్షన్ కూడా ఇచ్చాడు. మొత్తానికి ఓ రెండు వందలు వదిలింది. నిజం చెప్పొద్దూ. నాకు ఈ సాయి ఉత్త వెర్రిబాగులాడిలా అనిపించాడు.


ఈ ఖర్చు కాక అతని రోజు జీతం రెండు వందలా ఏభై కూడా గోవిందా. ఈ పక్షి మూలంగా.

ఇక దానిని ఎక్కడ వదుల్దామా అని వెతుకుతూ, మధ్యాహ్నం దాకా చెరువుల వెంబడి తిప్పాడు. చివరకి చాదర్‌ఘాట్ పాత బ్రిడ్జీ దగ్గర గుంపులు, గుంపులుగా ఉన్న కొంగల్ని చూసి

అక్కడ స్కూటర్ ఆపాడు. నా చేతిలో ఉన్న కొంగని, ఓ ముద్దిచ్చి మరీ ఆ మూసీ ఒడ్డున కదిలాడు.

అందరికీ వింతే. అవేమీ పట్టించుకోకుండా, నన్ను మళ్లీ కూర్చోబెట్టుకుని మా ఆఫీసులో దింపి తను వెళ్లిపోయాడు సాయి. ఇంత దయ నిండిన గుండె ఏమిటా అని ఆలోచిస్తూనే పని చేసుకున్నాను.

సాయంత్రం అయింది. ఏదో బస్ ఎక్కి అబిడ్స్ గ్రామర్ స్కూల్ దగ్గర నిల్చున్నాను డైరెక్ట్ బస్ కోసం. స్కూల్ కాంపౌండ్ వాల్ పక్కన కనిపించింది ఈసారి ఓ పావురం. కాలు విరిగింది కాబోలు. ఓ వైపుకి ఒదిగిపోయి అటు ఇటూ కదులుతోంది.



స్కూలు పిల్లలు, నాలాగా బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీకులు, అందరం అటే చూస్తున్నాం. మధ్య మధ్య బస్ వచ్చేస్తుందేమో అని పరికిస్తూ.

నాకు జాలేసింది గానీ, ఉదయం అయిన ఖర్చు గుర్తొచ్చి చెప్పొద్దూ. మనకెందుకు ఈ తంటా అనిపించింది.

పైనున్న కరెంటు తీగలలోంచే ప్రసరించిన పవర్ షాకుకి కాలు విరిగిందేమో' అన్నారు ఎవరో!

ఇంతలో, చక్కగా టక్ చేసుకుని, షూస్, టై ధరించిన ఓ వ్యక్తి అక్కడకి వచ్చాడు ఓ బ్రీఫ్‌కేసుతో. సరాసరి ఆ పావురం దగ్గరికి వచ్చి దాన్ని పట్టుకున్నాడు. బాధగా అరిచింది పావురం.

"పోనీలే! మరో సాయి కాబోలు. పావురాన్ని రక్షించాడు" అనుకున్నాను మనసులోనే.

చేతిలో ఉన్న పావురాన్ని ఓసారి పైకెత్తి, దాని మెడని 'కడుక్కు'ని వెనక్కి తిప్పాడు. క్కె...క్కె...క్కె.. అన్న శబ్దం ఓ సెకనుపాటు వచ్చి ఆగిపోయింది.

దాన్ని పుస్తకంలా మడిచి పక్కన ఉన్న మొక్కజొన్నపొత్తుల బండీ వాడి దగ్గర్నించీ ఓ కవర్ లాక్కుని, పావురాన్ని అందులో కుక్కి బ్రీఫ్ కేసులోకి తోశాడు. క్షణాల్లో జరిగిపోయిందది. ద్రవించిన నా గుండె కళ్లల్లోంచీ నీటిలా కరిగిపోయింది. మళ్లీ ఇందాకటిలా అదే స్టైల్‌లో సాగిపోయాడా వ్యక్తి జి.పి.ఓ. వైపు.

ఇంటికి వచ్చేశాను. అయినా నా మనసు మనసులో లేదు. అమ్మకి, అత్తయ్యగారికి చెప్పాను. సాయి కోసం ఎదురుచూసి మరీ, రాగానే ఈ విషయం చెప్పాను.

"నువ్వే ముందు చూశావుగా రూపా. ఇంటికి తెస్తే ఎంత బాగుండేది? మనం వదిలిన కొంగ, తన తోటిపక్షులతో కలిసి ఎంత ఆనందంగా తిరుగుతోందో. నేను అక్కడి నుండే వస్తున్నా. ప్ఛ్! తప్పు చేశావ్" అన్నాడు సాయి విచారంగా.

భగవంతుడు సృష్టించిన మనందరికీ, కాళ్లూచేతులూ సమానంగానే ఉంటాయి. మరి మనస్తత్వం ఎందుకు ఒకలా లేదు. ఇదే నాకు ఇప్పటికీ సందేహం. తీర్చగలరేమో ఆలోచించండి మరి!

★

